క్లుప్తంగా

వైభవంగా పుష్పయాగం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డి బజారులోని శ్రీ సుందరేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి వేడుకల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. పాతిక రకాల పూలతో అర్చకులు చంద్రమౌళీ శర్మ ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు తమ వంతుగా భక్తి శ్రద్ధలతో స్వామికి దాదాపు వంద కిలోల పూలను సమర్పించారు. శివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. పూజల అనంతరం భక్తులకు స్వామి ప్రసాదంగా పూలను అందజేశారు.

13న గ్రాడ్యుయేషన్ డే

కడప ఎడ్యుకేషన్ : ఏపీ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2018-21తోపాటు 2019-22 సంవత్సరంలో కడప నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ చదివి ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మార్చి 13న గ్రాడ్యుయేషన్ డే(స్నాతకోత్సవం) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి. సలీం బాషా తెలిపారు. ఈ సమావేశానికి యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌తోపాటు సంబంధిత అధికారులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున 2018-21తోపాటు 2019-22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ 11వ తేదీలోపు కళాశాలలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం



గండి క్షేత్రంలో భక్తజన సందడి

చక్రాయపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగునున్న తమిళనాడు, కర్నాటక రాష్ట్రలకు చెందిన భక్తులు పొలతల జాతరకు వెళ్లి అక్కడి నుంచి గండిక్షేత్రానికి వచ్చి వీరాంజనేయస్వామిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆలయ అధికారి, పాలకమండలి, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల వాహనాలు ఎక్కువగా ఉండటంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. ఏర్పాట్లను ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజలు పర్యవేక్షించారు.

వైభవంగా సాగిన శివ, పార్వతుల కల్యాణం



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న ఉభయదారులు

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వరాలయంలో శనివారం శివ, పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను తేరుపై ఉంచి మంగళ వాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులచే ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనిమెల సంగమేశ్వరాలయంలో రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చైర్మన్ ఎన్‌పీ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్సవాలకు ఆర్థిక సహాయం చేసిన దాతలకు, ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసుకున్న పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పొలతలలో తాత్కాలిక హుండీ లెక్కింపు

పెండ్లిమర్రి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతల క్షేత్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీలను శనివారం ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఉత్సవాల మూడు రోజులకు గానూ మల్లేశ్వర స్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి వద్ద ఉన్న తాత్కాలిక హుండీలను లెక్కించగా రూ.11,38,124 లక్షలు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.3,52,500, అంగడి బాడుగల ద్వారా రూ.45,600, అర్జిత సేవల ద్వారా రూ.10,82,165 నగదు లభించిదన్నారు.

దుగ్గాయపల్లెలో అన్నదానం

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పొలతల పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి వెళుతున్న భక్తులకు పెద్ద లేబాక గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానికులు, గ్రామ పెద్దల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ



మహిళలను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్పెషల్ కలెక్టర్ కౌసర్ బాను, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. శనివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను అమరావతి మహిళా విభాగం చైర్ పర్సన్ మేరీ విజయకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇటు కుటుంబంను నిర్లక్ష్యం చేయకుండా, అటు ఉద్యోగంను క్రమశిక్షణతో చేస్తూ తాము ఎవరికీ తక్కువ కామని, మానసికంగా చాలా బలవంతులని నిరూపించు కొన్నారని ప్రశంసించారు. మహిళలు చైతన్యవంతులు అయితేనే దేశం ప్రగతి పథంలోకి పయనిస్తుందని తెలిపారు. ఇంట్లో తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రోత్సహించాలని, నా తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే ఈనాడు నేను ఈ స్థాయిలో మీ ముందు ఉన్నానని తెలిపారు. మహిళల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయం అందిస్తామన్నారు. మహిళలు ఏ పని చేసినా క్రమశిక్షణతో చేస్తే ఏ రంగంలో అయినా రాణిస్తారని, ఈ రకంగా ముందుకు పోవాలని పేర్కొన్నారు. ఏపీజేఏసీ అమరావతి వైఎస్సార్ జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణ కుమార్, కోశాధికారి రోనాల్డ్ శామ్యూల్ రాజ్‌లు మాట్లాడుతూ ఏ డిపార్టుమెంటులో ఎటువంటి సమస్యలు ఎదురైనా అమరావతి జేఏసీ మహిళా మణులకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ మహిళా విభాగం నాయకులు విజయ, శారద దేవీ, కమల, అనురాధ, సౌజన్య, శైలజ, పద్మావతి, సుజాత, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

కడప ఎడ్యుకేషన్ : మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డీఈఓ మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ వైఎస్ఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కడప నగరం శంకరాపురంలోని స్కౌట్ హాల్‌లో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి అధ్యక్షత సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితం అయిన మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇది చాలా శుభ పరిణామం అన్నారు. మహిళాభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. విద్య పరంగా అభివృద్ధి సాధించిన దేశాలు, రాష్ట్రాల్లో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

భారతదేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా నేటికి కొన్ని రంగాల్లో స్త్రీలు అణిచివేతకు గురవుతున్నారన్నారు. పురుషులతోపాటు స్త్రీలు అన్ని రంగాల్లో సమానంగా రాణించినా ఆర్థిక సమానత్వాన్ని సాధించలేక పోతున్నారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా మాట్లాడుతూ నేటి అధునిక సమాజంలో కూడా స్త్రీల పట్ల వివక్ష, చిన్న చూపు తగదన్నారు. నేటికి స్త్రీల పట్ల అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరగడం సమాజానికి మాయని మచ్చ అన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ప్రమీల మాట్లాడుతూ స్త్రీలు విద్యద్వారా చైతన్యవంతులై తమ పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను, హింసను ప్రతిఘటించాలన్నారు. ఏ సమాజంలోనైనా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే మహిళాభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష మాట్లాడారు. అనంతరం డీఈఓతోపాటు పలువురి మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జయనగర్‌కాలనీ హైస్కూల్ హెచ్ఎం బాగ్యవతి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పర్వీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరీ, నాయకులు దేవదత్తం, రమణమ్మ, శివకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే సామాజిక రక్షణ

కడప కల్చరల్ : నైతిక విలువలు పెరిగినప్పుడే మహిళలకు సామాజిక రక్షణ లభించగలదని ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

ఇంటాక్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మానస సమావేశ మందిరంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రముఖులు ఎస్.శివపార్వతి, అసంతమ్మ, నాగవేణి, వెంకటలక్ష్మిలను సంస్థ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కో-కన్వీనర్ పి.సుబ్బారెడ్డి, కొండూరు జనార్దన రాజుల ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డి.వెంకటరెడ్డి, డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, జమాల్‌రెడ్డి, భారవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేడు కార్మిక వర్గం విపత్కర పరిస్థితుల్లో ఉందని గుర్తు చేశారు. 175 సంవత్సరాలుగా దేశ కార్మిక వర్గం విడివిడిగా, ఐక్యంగా చేసిన ప్రతిఘటన పోరాటాల ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వం, ఇండియన్ గవర్నమెంట్ సుమారు 44 కార్మిక రక్షణ చట్టాలు, చట్టసభల్లో ఆమోదించి, అమలు జరుపుతుండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన ఈ పది సంవత్సరాలలో కార్మిక చట్టాలన్నీ రద్దు చేసి, నాలుగు కోడ్స్‌గా మార్చారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. స్వామినాథంకు భారతరత్న ఇచ్చి స్వామినాథన్ సిఫారసులను మాత్రం పాతి పెట్టారన్నారు. రైతులను శత్రువులాగా చూస్తూ వారి పోరాటాన్ని అణచివేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, ఎస్.భైరవ ప్రసాద్, వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పీస్ స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్‌పీర్ అన్నారు. శనివారం కడప నగరం మరియాపురంలోని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో టైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం కూడా పొందవచ్చన్నారు. టైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్టులో కరాటేలో శిక్షణ పొందిన పీఎస్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపించడం అభినందనీయం అన్నారు. ఈ ప్రమోషన్ టెస్టులో కిక్స్, కటాస్, హ్యాండ్ మూమెంట్స్, సెల్ఫ్ డిఫెన్స్, ఫైట్స్ టెస్టు కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో జిల్లా సెక్రటరీ మాస్టర్ ఎస్‌కే వసీం, పీస్ స్కూల్ కరాటే కోచ్ మన్సూన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు పెద్దపీట వేసింది వైఎస్ కుటుంబమే



ఎమ్మెల్యే, చైర్మన్‌లను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

కమలాపురం : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసింది వైఎస్ కుటుంబమేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జుమ్మా మసీదులో ప్రభుత్వ ఖాజీ నాసీర్ హుసేని వితరణ చేసిన దుస్తులను మండలంలోని అన్ని మస్జిద్‌లకు చెందిన ఇమాం, మౌజన్‌లకు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభ్యున్నతికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీజం వేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ముస్లింలు ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిర పడ్డారన్నారు. ప్రస్తుతం సీఎం ముస్లింలకు సుస్థిర స్థానం కల్పించారన్నారు. డిప్యూటీ సీఎం హోదా ముస్లింకు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం కూడా 7 ఎమ్మెల్యే స్థానాలు ముస్లింలకు కేటాయించారన్నారు. టీడీపీ కేవలం ఒక్క స్థానానికి మాత్రమే ముస్లింలకు కేటాయించిందన్నారు. ఇది మనందరి ప్రభుత్వం అని, మరో సారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు లాగా జగన్‌కు నటించడం రాదని చెసేదే చెబుతాడన్నారు. మీకు ఏ సమస్య వచ్చిన నాకు ఏటైంలో అయినా ఫోన్ చేస్తే చాలని మీ సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మత పెద్దలు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ స్టేట్ కమిషన్ మెంబర్ హిదాయత్, మండలంలోని అన్ని మస్జిద్‌ల ఇమాంలు, మౌజన్‌లు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శంఖు స్థాపనలు చేశారు. రూ. 20 లక్షలతో పుట్లంపల్లె యానాదీ కాలనీలోని సీసీ రోడ్లు, పుట్లంపల్లె-ఇందిరమ్మ కాలనీలను కలిపే కావలుపై కల్వర్ట్ పనులతో పాటు రూ.35 లక్షలతో బీడి కాలనీలో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత



పెద్దకుడాలలో జ్యోతుల ఉత్సవం

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన గంగమ్మ దేవతకు కంకణధారన సందర్భంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి ఇంటి వద్ద నుంచి అమ్మవారి భరణాలను, పట్టువస్త్రాలను జ్యోతులు, డప్పుల మేళాలతో అమ్మవారి గుడికి తీసుకెళ్లారు. అమ్మవారిని ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి తిరుణాలకు శ్రీకారం చుట్టారు. శనివారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద ఉదయం, సాయంత్రం డప్పులు, మేళాలతో తిరుణాలకు అమ్మవారిని మేలుకొలుపుతారని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద ధ్వజస్తంభంపై 17వ తేదీ వరకు అఖండ జ్యోతిని వెలిగింపజేస్తారు. ఈ నెల 17వ తేదీన పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో గంగమ్మ తిరుణాల నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. తిరుణాల రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి చెక్కభజనలు, కోలాటాలు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు కార్యకర్తలు, నాయకులు సంసిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధమని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు రాకుండా అడుగడుగునా అడ్డుకోవాలని చూసిన టీడీపీ, జనసేన ఒక వైపు ఉంటే.. న్యాయస్థానాలను ఆశ్రయించైనా సరే పేదలకు మేలు చేయాలని చూసిన వైఎస్సార్‌సీపీ మరో వైపు ఉందన్నారు. కరోనా సమయంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకులు చెప్పి సంక్షేమ పథకాలను ఆపాలని చూడలేదన్నారు. ఎలాగైనా సరే పేద ప్రజలకు మేలు చేయాలని భావించారన్నారు. అలాగే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షం కోర్టుకు వెళ్లిందని, న్యాయస్థానంలో పోరాడి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చిన సీఎం జగన్‌కు పేదలు అండగా నిలుస్తారన్నారు. వారిని పోలింగ్ బూత్‌లకు రప్పించి ఓట్లు వేయించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ బూత్ ఏజెంట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలన్నారు. మన జిల్లా వాసి వైఎస్ జగన్ మరోసారి సీఎం అయితే జిల్లాతోపాటు కడప నగరం రూపురేఖలు మారిపోతాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, జమాల్‌వలీ, సుభాన్‌బాషా, ఎస్.సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, తోటక్రిష్ణ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామికి మాఘమాసం ఐదవ చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే అభిషేకం నిర్వహించి భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన మల్లెంకొండేశ్వర బ్రహ్మోత్సవాలు

గోపవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున రావడం జరిగింది. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున కొండపైన స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, ఈవో శివయ్య కొండ పైన అన్ని వసతులు సమకూర్చారు. దాతల సాయంతో తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అన్నిశాఖల అధికారులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీలోని ఉలవలపల్లె ఎస్సీ కాలనికి చెందిన పలువురు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



అల్లాడుపల్లెలో జన సందోహం నడుమ బండలాగుతున్న ఎద్దు

చాపాడు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం జన సందోహం నడుమ జరిగిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రమేష్ ఎద్దు 1680 అడుగులతో ప్రథమ స్థానంలో నిలువగా, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలాయపల్లెకు చెందిన రమణారెడ్డి ఎద్దు 1585 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన నాగయ్య ఎద్దు 1468 అడుగులతో తృతీయ, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు 1452 అడుగులతో నాలుగవ, అనంతపురం జిల్లా యాడికికి చెందిన చెన్నప్ప ఎద్దు 1354 అడుగులతో ఐదవ, ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డి ఎద్దు 1251 అడుగులతో ఆరవ, ఎం.రమేష్‌కు చెందిన ఎద్దు 1205 అడుగులు బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు ఎంపీపీ లక్షుమయ్య, ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డిల చేతుల మీదుగా వరుసగా కమలాపురం మండల కుప్పూరు వారిపల్లెకు చెందిన లక్ష్మణరెడ్డి రూ.1,00,116, లక్ష్మీపేట నారాయణరెడ్డి రూ.70,116, అల్లాడుపల్లె రజకుల సంఘం, చెన్నూరు జ్యూవెలర్స్ వారు రూ.60,116, చియ్యపాడు కాత్యాయని కన్‌స్ట్రక్షన్ ఎండీ పీవీ రమణారెడ్డి రూ.40,116, టీ.మఠం రవీంద్రనాథ్‌రెడ్డి రూ.20,116, నరహరిపురం పి.చిన్నవీరారెడ్డి కుటుంబీకులు రూ.12,116, కోడూరు వెంకటేష్ కుటుంబీకులు రూ.5,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సింగిల్ విండో వేమారెడ్డి, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ఆర్టీసీ బస్టాండు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కమలాపురం : కమలాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అలాగే తాను చదువుకున్న చోటే బస్టాండును నిర్మించడం సంతోషంగా ఉందని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో రూ.1.08 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆర్టీసి బస్టాండును ఆర్టీసి అధికారులతో కలసి చైర్మన్, ఎమ్మెల్యేలు బస్టాండు సమీపంలోని కోట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బస్టాండు, కౌంటర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు క్రాస్ రోడ్డు వద్ద రూ. 5.75 కోట్లతో నిర్మించిన ఆర్చి, సీసీ రోడ్డు, బ్యూటిఫికేషన్, డివైడర్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న ఊర్లో అత్యాధునిక హంగులతో బస్టాండు నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కమలాపురంలో డిపో పెట్టాలని తాను, ఎమ్మెల్యే భావించామని అయితే స్థలాభావంతోనే ఆ నిర్ణయాన్ని విరమించుకుని ఇదే బస్టాండును ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇపుడు వస్తున్న కోగటం, మైదుకూరు బస్సులతో పాటు కమలాపురం రైల్వే గేటు వరకు వచ్చే షటిల్ సర్వీసును బస్టాండు వరకు వచ్చేలా ఆదేశించామన్నారు. పులివెందుల, అనంతపురం నుంచి కమలాపురం మీదుగా బద్వేలు, నెల్లూరు వరకు బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంలో ఇప్పటికే వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. క్రాస్ రోడ్డు నుంచి అభివృద్ధి కళ్లకు కనబడుతుందన్నారు. మార్కెట్ యార్డులోనే రెండు వైపుల షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆర్చి, సీసీ రోడ్డు, డివైడర్, మున్సిపల్ భవనం, ఆసుపత్రి, పాలిటెక్నిక్ కళాశాల భవనం, ఆర్టీసీ బస్టాండు, మధ్య మధ్యలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించామన్నారు. పట్టణం అంతా డ్రైనేజ్, స్ట్రాం వాటర్ డ్రైనేజ్ నిర్మించామన్నారు. అభివృద్ధి కేవలం ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. ఆరు సార్లు ఆర్‌ఓబీకి టెండర్లు పిలిచామని, బురదజల్లక పోతే ఓపెన్ టెండర్లలో పాల్గొని ఆర్‌బీఓలు టీడీపీ నాయకులే నిర్మించవచ్చు కదా అని ప్రశ్నించారు. తనకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే తాను ఆర్‌ఓబీని ప్రణాళికా బద్ధంగా నిర్మాణ పనులు చేపట్టానన్నారు. టీడీపీ హయాంలో కేవలం అప్పటి మంత్రి ఆదితో టెంకాయతో కొట్టి ఆర్‌ఓబీ పనులు ప్రారంభించామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా టీడీపీ వారికి మనుషులు దొరకక పోవడంతో వారి ఫేక్ మనుషులకే కండువాలు వేసి 200-300 మంది టీడీపీలో చేరారని సోషల్ మీడియా ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గంగవరం, విభరాపురం మీదుగా కడప-ప్రొద్దుటూరు బస్సు సర్వీసు కావాలని ప్రజలు అడిగారని తప్పక ఈ సర్వీసు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రంలో ఆర్టీసీ అధికారులు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, గంగాధర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, సాదిక్, ఇర్ఫాన్, గఫార్, లక్ష్మీనారాయణరెడ్డి, చెన్న కేశవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.